ప్రజాశక్తి
మంగళవారం 12 ఆగస్టు 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మహిళా సమస్యలపై ఉధృత పోరాటాలు

- బిజెపి హయాంలో పెరిగిన దాడులు, హింస, అణచివేత, వివక్షత
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి
- ఘనంగా సంఘం విశాఖ జిల్లా మహాసభలు ప్రారంభం

మహాసభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, వేదికపై ప్రభావతి తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తరువాత మహిళలపై దాడులు, హింస, అణచివేత, వివక్షత పెరిగాయని, భద్రత కరువైందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మహిళా సమస్యలపై రానున్న కాలంలో ఉధృత పోరాటాలు నిర్వహించనున్నామని తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా 17వ మహాసభలు సోమవారం శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో వివిధ ఉద్యమాలకు, పోరాటాలకు నాయకత్వం వహించిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత సంఘం సీనియర్ నాయకులు వి.లక్ష్మి సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం నుంచీ ఎలాంటి పోరాటాలు నిర్వహించిందీ, విజయాలు సాధించిందీ తెలియజేశారు. నేడు సంప్రదాయాల పేరుతో మహిళలపై అనేక మిగతా 2లో..

వార్త మెయిన్‌లో..

ప్రమాదానికి కారణమైన బస్సు, ఇన్‌సెట్‌లో మృతురాలు ముత్యాలమ్మ (ఫైల్ ఫోటో)

ప్లాట్‌ఫారం పైకి దూసుకొచ్చిన బస్సు

మహిళ మృతి, ఒకరికి గాయాలు

విశాఖ కలెక్టర్ పేరిట ఫేక్ అకౌంట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేరుతో ఫేస్ బుక్‌లో ఫేక్ అకౌంటు కానరావడం కలకలం సృష్టించింది. గతంలో ఇటువంటి ఫేక్ అకౌంట్ వచ్చినప్పుడు హరేంధిర ప్రసాద్ స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరలా అటువంటి ఫేక్ అకౌంట్ వెలుగులోకి రావడంపై ఆయన ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్వాతంత్ర దినోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ భవనంలో సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం సమీక్షించారు. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలోని పోలీస్‌మైదానంలో 15న ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్ర్య వేడుకలకు జిల్లాప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనన్నారు. పైలెట్ వాహనం, శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాల ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలన్నారు. జివిఎంసి ఆధ్వర్యంలో ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు మిగతా 2లో..

బల్క్ డ్రగ్ పార్క్‌కు భూములివ్వం

వార్త 7లో..

ఈదురుగాలుల బీభత్సం

వార్త 8లో..

అధిక వడ్డీ పేరుతో టోకరా!

వార్త 7లో..

పనులను పరిశీలిస్తున్న ప్రణవ్‌గోపాల్, అధికారులు

త్వరలో అందుబాటులోకి గ్లాస్ బ్రిడ్జి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిపై నిర్మిస్తున్న గ్లాస్ బ్రిడ్జిని అతి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నామని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ వెల్లడించారు. సోమవారం ఉదయం వారు గ్లాస్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. పలు అంశాలపై ఆరా తీశారు. ఆసియాలోనే అతి పొడవైన గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం కైలాసగిరిపైనే జరుగుతోందని తెలిపారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కైలాసగిరిపై ఏర్పాటు మిగతా 2లో..

ఆసుపత్రి పనిలోనే నిమగ్నంకండి

- ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి
- కెజిహెచ్ వైద్యులతో సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ వైద్యులందరూ ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విధి సమయాలను తప్పక పాటించాలని, డ్యూటీ సమయాల్లో ఆసుపత్రి పనుల్లోనే పూర్తిగా నిమగ్నం కావాలని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం. సంధ్యాదేవి స్పష్టం చేశారు. సోమవారం సాయంతం పానగల్ బిల్డింగ్ పరీక్షా హాల్‌లో ఆంధ్ర మెడికల్ కాలేజ్ (ఎఎంసి), కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్)కి చెందిన అన్ని స్థాయిల వైద్యుల సమావేశం జరిగింది. దీనికి ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఎఎంసి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంధ్యాదేవి మాట్లాడుతూ రోగి సేవలతో పాటు బోధన, పరిశోధన కార్యకలాపాలకు అందరూ అందుబాటులో ఉండడం ముఖ్యమన్నారు. ఎన్ఎంసి నిబంధనలు, పై అధికారుల ఆదేశాలను పాటించడం ద్వారా సంస్థ ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ ఈ నెల 7న విశాఖపట్నం పోర్టు పరిసర ప్రాంతాలులో జరిగిన పేలుడు ప్రమాద సమయంలో అత్యవసర కేసులను కెజిహెచ్‌కు తరలించినప్పుడు ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, అనస్థీషియా, ల్యాబ్ విభాగాలు అందించిన అత్యవసర సేవలు అభినందనీయమన్నారు. అలాంటి సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రతి రోజూ ఉండాలన్నారు.

మాట్లాడుతున్న సంధ్యాదేవి

మొదటి పేజీ తరువాయి..

మహిళా సమస్యలపై ఉధృత పోరాటాలు

రూపాలలో అణచివేత, వివక్షత పెరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లినప్పటికీ వరకట్న సమస్య, గృహ హింస వంటివి వేధిస్తూనే ఉన్నాయన్నారు. ఆడపిల్లలతో పాటు మగ పిల్లలకూ ఇంటి పనులు, విలువలు నేర్పించాలని, యుక్త వయసులో కౌన్సిలింగ్ ఇవ్వాలని, అప్పుడు మాత్రమే సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సి ఉందన్నారు. మహిళా చట్టాలు పటిష్టంగా అమలు కావడం లేదన్నారు. మహిళలను కించపరిచే, అణచివేసే సంస్కృతిని బిజెపి పెంచిపోషిస్తోందని తెలిపారు. ధర్మస్థలిలో వేలాది మంది అమ్మాయిలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయని ప్రత్యక్షంగా బయట పడినా బిజెపివారిపై చర్యలు కానరాలేదన్నారు. మహిళా పక్షపాతి అని చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్ దీనిపై నోరు విప్పక పోవడాన్ని బట్టి అతని నిజ స్వరూపాన్ని మహిళలు అర్థం చేసుకోవాలని కోరారు. భారత శిక్షా స్మృతి వద్దు.. మను స్మృతి కావాలని బిజెపి వాదిస్తోందని తెలిపారు. మహిళలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి కోసం పోరాడుతూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అనేక రూపాలలో వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, మైక్రో ఫైనాన్స్ దోపిడీకి, మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలు నిర్వహించాలని అన్నారు.

తొలుత సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి గడిచిన మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలను తెలియజేశారు. కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, ఉపాధ్యక్షులు ఆర్.విమల అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సభలో రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, జిల్లా ఆఫీసు బేరర్లు ఎస్.విజయలక్ష్మి, ఆర్.వరలక్ష్మి, కె.కుమారి, వి.భారతి, జి.లక్ష్మి, కె.వేణు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

సూచించారు.

సంక్షేమాన్ని చాటిచెప్పేలా శకటాలు,స్టాళ్లు

ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన నిర్వహించాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర, యుసిడి ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలు, ఇతర కార్యకలాపాలను తెలుపుతూ జివిఎంసి, మాస్టర్ ప్లాన్ 2041లో భాగంగా చేపట్టే అభివద్ధి ప్రాజెక్టుల గురించి వివరిస్తూ విఎంఆర్‌డిఎ, శకటాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వివిధ పథకాల కింద లబ్ధిపొందిన ప్రజలకు నగదు పంపిణీకి సంబంధించి చర్యలు తీసుకోవాలని,జాబితా రూపొందించాలని సూచించారు.ఇవే అంశాలపై సోమవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్,జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు హర్‌ఘర్ తిరంగాయాత్ర

భారత స్వాతంత్ర్యానికి 79 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా,కేంద్ర పర్యాటక సాంస్కతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి బీచ్‌రోడ్‌లో హర్‌ఘర్ తిరంగాయాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా జాతీయ పతాకం ప్రాముఖ్యతను, స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ జెండా భూమికను తెలిపే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు వెల్లడించారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం అధికారులను ఈ మేరకు ఆదేశించారు. పక్కా ఏర్పాట్లు చేయాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కాళీమాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకు భారీఎత్తున తిరంగాయాత్ర సాగుతుందని, బైక్ ర్యాలీ ఉంటుందని థింసా, కోలాటం, భరతనాట్యం వంటి కళారూపాల ప్రదర్శనతో తిరంగా యాత్ర జరుగుతుందన్నారు. యాత్రలో ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

త్వరలో అందుబాటులోకి గ్లాస్ బ్రిడ్జి

చేయనున్న త్రిశూల్ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, మధుసూదన్‌రావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సోమవారం స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి ఇచ్చామని, బయోమెట్రిక్‌లో ఆధార్ లింక్ తీసి వేయాలని కలెక్టర్‌ను కోరటం జరిగిందన్నారు. సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, సోమేశ్, జి.అప్పలరాజు, ఎం.తాతబ్బాయి, నాయుడు తదితరులు ఉన్నారు

నిరసన తెలుపుతున్న నాయకులు

విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలంటూ సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం 24 గంటల దీక్ష ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొన్నారు. రాత్రి అక్కడే నిద్రించారు. వారి పోరాట పటిమను పలువురు మెచ్చుకున్నారు. (వార్త మెయిన్‌లో..)

జాతీయ మీడియా సదస్సుకు ఆహ్వానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజస్థాన్‌లోని మౌంట్‌అబూలో సెప్టెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సు-2025కు జర్నలిస్టులు హాజరు కావాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బికె రామేశ్వరి తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత అణు రీసెర్చ్ సెంటర్ విశ్రాంత డైరెక్టర్ పి.సి ఉపాధ్యాయ మాట్లాడుతూ సమాజంలో శాంతిని, పవిత్రతను కాపాడటంలో మీడియా ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ నెల 25న ప్రకాష్‌మణిదాదీ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్ స్థాయికి తీసుకువెళ్తామని 22,23,24 తేదీల్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజాపిత సంస్థ మరో ప్రతినిధి మాధురి మాట్లాడుతూ ఈ శిబిరంలో అధికశాతం యువత పాల్గొనాలన్నారు. గౌరవ అతిథిగా బ్లడ్‌మాన్ వినోద్‌బాలు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం 85558 57990, 9177744966 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

జిఒ 124 ప్రకారం పెరిగిన జీతాలు చెల్లించాలి

మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంకటరెడ్డి, రాజు, గంగారావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిఒ 124 ప్రకారం పెరిగిన జీతాలను మున్సిపల్ కార్మికులు అందరికీ చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి కోరారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రతిపాదించిన మేరకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించిన ప్రకారం 2025 మే నెల ఎరియర్స్ మాత్రమే చెల్లించారని తెలిపారు. అలాగే ఏడు సంవత్సరాల సర్వీసు ఉన్న వారికి కూడా ఎరియర్స్ చెల్లించాలని చెప్పారు. అందుకు ధన్యవాదాలు తెలిపారు. అయితే, ఇంకా మిగిలి ఉన్న కార్మికులకు కూడా బకాయిలు చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిఒ 124ను జులై 21న విడుదల చేసిందన్నారు. ఆ తేదీ నుంచి పెరిగిన వేతనాలను అందరికీ అమలు చేయాలని కోరారు. నీటి సరఫరా కార్మికులతో పాటు ఇంజినీరింగ్, యుజిడి, పార్కులు, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, మ్యూజియం, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, నాన్ పిహెచ్ కార్మికులందరికీ ఈ పెంపుదల ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు పాల్గొన్నారు.

రాహుల్, ప్రియాంక అరెస్టులపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓటర్ల జాబితాలో అక్రమాలను ఖండిస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ర్యాలీ సందర్భంలో పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని, పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీని, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు. బిజెపి ప్రభుత్వ నిర్బంధకాండను ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, నాయకులు ప్రియాంక దండి, మహేష్, రామకృష్ణ, కస్తూరి వెంకటరావు, చెన్నా అప్పారావు, రజియా బేగం, బాషా పాల్గొన్నారు.

మహారాజశ్రీ పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S.No. 11/2024,

Between:
ఊక సాధు రెడ్డి ......వాది
And:
మిరియాల సత్యనారాయణ వగైరాలు..ప్రతివాదులు
To:
D.1) మిరియాల సత్యనారాయణ, S/o. బాల రామినాయుడు, వెంకటాపురం గ్రామం, తానాం పోస్టు, మునగపాక మండలం, అనకాపల్లి జిల్లా -531021
D.4) మిరియాల గుణ శేఖర్ నాయుడు, S/o. సత్యనారాయణ, వెంకటాపురం గ్రామం, తానాం పోస్టు, మునగపాక మండలం, అనకాపల్లి జిల్లా - 531021

పై నెంబరు దావాలో వాది తనఖా మొత్తము సొమ్ము రాబట్టే నిమిత్తము ఇందలి ప్రతివాదులపై డిక్రీ కోరుతూ పై కోర్టులో దావా దాఖలు చేయగా శ్రీ కోర్టువారు 1 మరియు 4 ప్రతివాదులకు నోటీసులు అందే నిమిత్తము **తేది.28.08.2025**కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినం మీరు స్వయంగాగాని, వకీలు ద్వారా గాని పై **తేదీన ఉదయం గం.10.30ని.ల**కు పైకోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

ఇట్లు
M. నాగార్జున,
న్యాయవాది, పార్వతీపురం.

పుస్తకాలపై నిషేధం అనైతిక చర్య

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : అక్షరాలు, పుస్తకాలను చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోందని వై.విజయ్‌కుమార్ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి విమర్శించారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే 25 పుస్తకాలను కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా నిషేధించారని స్పష్టం చేశారు. సంఘ్ పరివార్ ప్రోద్బలంతోనే రచయితల భావ ప్రకటన స్వేచ్ఛపై ఈ తరహా నిరంకుశ చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ చర్యలను పుస్తక ప్రేమికులు, అభ్యుదయ వాదులు, ప్రగతిశీల శక్తులు గర్హించాలని కోరారు. పుస్తకాలపై నిషేధం ఎత్తివేసేలా కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని పిలుపునిచ్చారు.

ఈట్ రైట్ క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం జివిఎంసి ఈట్ రైట్ క్యాంపెయిన్‌ను ప్రారంభించి వాటి అమలుకు 16 ప్రత్యేక ఎస్‌హెచ్‌ఇ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్టు జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు, వీధి ఆహార విక్రయ కేంద్రాలలో ఆహార నాణ్యత, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, పలు ఆహార పదార్థాల్లో హానికరమైన రసాయనాలను వినియోగించడం వల్ల కేన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

.మానసిక ఒత్తిడి నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తాజాసర్వేలో అతిగా ఆలోచిస్తూ మానసిక ఒత్తిడికి లోనవుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని తేలిన నేపథ్యంలో 'మనసును అదుపులో పెట్టుకోండి' పేరిట ప్రచార అవగాహనా ర్యాలీని సెంటర్‌ఫ్రెష్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని బీచ్ రోడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెర్ఫెట్టి వాన్‌మెల్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ గుంజన్ ఖేతాన్ మాట్లాడుతూ దేశంలో తాజాగా ఓ కొత్త రిఫ్రెషింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించామన్నారు.

మహారాజశ్రీ 13వ అదనపు జిల్లా జడ్జి, గాజువాక వారి కోర్టులో
E.P.No. 2/2025 in O.S.No. 60/2018

బిట్వీన్:
నాగోతి పైడారావు . . . DHR/పిటిషనర్
అండ్:
యస్.కిరణ్మయి మరియు ఇతరులు
. . . JDR / డిఫెన్‌డెంట్స్

నోటీసు

టు:
ఆర్-4: యస్.సూర్యకాంతం,
భర్త త్రిమూర్తిరావు, M/o. యస్.వై.దుర్గాప్రసాద్
డో.నెం.49-54-3/3/1, సూర్యఎన్‌క్లేవ్,
బాలయ్యశాస్త్రి లేఅవుట్, విశాఖపట్నం.
ప్రస్తుతము:
డో.నెం.49-54-8/3, సూర్యఎన్‌క్లేవ్,
బాలయ్యశాస్త్రి లేఅవుట్, విశాఖపట్నం.

పైనెంబరు గల ఇ.పి.లో మీకు కోర్టు నుండి ఎన్నిమార్లు నోటీసులు పంపినా మీరు అందు కోనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసులు పంపడమైనది. పై నెంబరు గల ఇ.పి.లో **తేది:02-09-2025న ఉదయం గం.10-30 ని॥లకు** వాయిదా అయివున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు ద్వారా గాని కోర్టు ఎదుట హాజరయి మీ వాదనలు తెలియజేయవలెను. లేనియెడల పై ఇ.పి. మీ పరోక్షమందు తీర్మాణం చేయుదురని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)
B.YASODHANA VEDAMANI
K.V. RAMANA & K.RAHUL
Advocates for DHR
Cell : 9248809477, 9246621519

నేతన్నల సంక్షేమానికి కృషి : గంటా

ప్రజాశక్తి- తగరపువలస : నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలసలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'నేతన్నల నేస్తంగా కూటమి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంచుకున్న ప్రాధాన్యతా రంగాల్లో వ్యవసాయం తర్వాత చేనేత రంగమేనని స్పష్టం చేశారు. సమాజంలో హుందాతనాన్ని తెచ్చేవి చేనేత వస్త్రాలేనని, అందులో చేనేత కార్మికుల శ్రమ ఇమిడి ఉందని తెలిపారు. రాష్ట్ర చేనేత కళాకారులకు జాతీయ స్థాయిలో పది అవార్డులు వచ్చాయంటే వస్త్రాల తయారీలో వారి నైపుణ్యం ఇట్టే కనబడుతోందన్నారు. శారీరక శ్రమతో మగ్గాలు నేసే క్రమంలో చేనేత కార్మికుల ఆరోగ్యం కొంత మేర దెబ్బతింటుందని, శారీరక దృఢత్వం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు అనేక వరాలు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, చేనేత వస్త్రాల అమ్మకాలపై విధిస్తున్న 5 శాతం జిఎస్‌టిని కూటమి ప్రభుత్వం భరిస్తుందని, విజయవాడ కేంద్రంగా చేనేత మ్యూజియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. చేనేత కార్మికుల విజ్ఞప్తి మేరకు స్థానికంగా సామాజిక భవనానికి అవసరమైన స్థలం, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను సన్మానించారు. తొలుత రాట్నంతో నూలు వడికారు. పద్మశాలి సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ కొప్పల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, టిడిపి కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పివి.నరసింహం, జెడ్‌పిటిసి సభ్యుడు గాడు వెంకట ప్పడు, ఎపి పద్మ శాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, టిడిపి నాయకులు తమ్మిన సూరి బాబు, కొప్పల కృష్ణ, చెట్టి అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పలుచోట్ల 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలసలో సోమవారం 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కూటమి పాలకుల మోసాలను తెలియజేస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దంతులూరి వాసురాజు, బంక సత్యం, మజ్జి వెంకట్రావు, కోరాడ అచ్యుత రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు వైసిపి అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యాన సోమవారం ఆరిలోవ కాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసంచేస్తోందంటూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాస్ పాత్రో, బేత దుర్గారావు, ప్రసంగి వాసు, కాకర గోవిందు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది రెండోరోజు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. బదిలీలు వెంటనే చేపట్టాలని, జిఒ 42 రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ నెల 11న ప్రారంభమైన నిరసన కార్యక్రమాలు 14 వరకు కొనసాగుతాయని, ప్రభుత్వం స్పందించకుంటే 18న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తామని జిల్లా జిసిజిటిఎ అధ్యక్షులు విష్ణుమూర్తి స్పష్టం చేశారు.

'హర్‌ఘర్ మే తిరంగా' వేడుకలు

ప్రజాశక్తి -ఆనందపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 'హర్‌ఘర్ మే తిరంగా' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపిపి తండ్రి మజ్జి వెంకటరావు ఆధ్వర్యాన 56వ బెటాలియన్ ఐటిబిపి కమాండెంట్ శ్రీహరిసింగ్ నేతృత్వంలో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వైవి.రెడ్డి, ఐటిబిపి కానిస్టేబుళ్లు, తర్లువాడ గ్రామస్తులు పాల్గొన్నారు.

13వ వార్డులో వీధి దీపాల పునరుద్ధరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : గత కొన్ని నెలలుగా వెలగకుండా ఉన్న వీధి దీపాల పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి. వార్డులో పలు ప్రాంతాల్లో వీధి దీపాల పునరుద్ధరణపై వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వీధి దీపాలను పునరుద్ధరించారు. ఈ పనులను సోమవారం కెల్ల సునీత దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వార్డులో ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోతే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. వార్డులో సుమారు 120 కొత్త దీపాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యవేక్షణలో వీధి దీపాల సూపర్‌వైజర్ రామ శంకర్, టిడిపి నాయకులు సూర్యనారాయణ, అప్పారావు, వడిశెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేములవలస పిఎసిఎస్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి- ఆనందపురం : వేములవలస ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ నాయకుడు రౌతు నాగరాజును వేములవలస జనసేన రూరల్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిలి జనసేన నాయకుడు షాకరి శ్రీనుబాబు హాజరై మాట్లాడుతూ, జనసేన పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ అధినేతకు, నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు, రైతు సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం అని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, జనసేన మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు బాలు, శివకృష్ణ, జానక కృష్ణ, నాయకులు రామలక్ష్మి, యశోద, ప్రశాంత్ కుమార్, లోడగల సురేష్, నాని, రాజు, ఆది, సుబ్బు పాల్గొన్నారు.

'చంద్రబాబు'కు పాలాభిషేకం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కళ్లివానిపాలెం యాతపేటలో ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము ఆధ్వర్యాన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కల్లుగీత కార్మికులకు బ్రాందీ షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించడం, తాజాగా బార్లలో కూడా 10 శాతం షాపులు కేటాయించడం, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల చంద్రన్న బీమా, ప్రమాదవశాత్తు వికలాంగులకు వయసుతో సంబంధం లేకుండా పెన్షన్ మంజూరు వంటి హామీలను నెరవేర్చినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కల్లుగీత సహకార సంఘాల నాయకులు గండిబోయిన రమణ, ఈశ్వరరావు, గండిబోయిన పెద్ద రమణ, గండిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ఎంఎస్ టిపి బే వద్ద ప్రమాదం జరిగి కాంట్రాక్ట్ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఎంఎస్ కెఆర్ఎల్ కాంటాక్టర్ వద్ద పనిచేస్తున్న సురేష్‌సింగ్ (26) పనిలో భాగంగా రాడ్లు తన్నుకొని కిందపడిపోయాడు. అతనిపై మెటల్ స్లాగ్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

అగనంపూడి ప్రాంతానికి చెందిన టి.అప్పారావు సిఒసిసిపి విభాగంలో అన్ స్కిల్డ్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎత్తు నుంచి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో తోటి కార్మికులు అతనిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తాడి అప్పారావు(54) మృతి చెందాడు.

సురేష్‌సింగ్ కుటుంబానికి పరిహారం

ఎస్ఎంఎస్ డిపార్ట్‌మెంట్‌లో మృతిచెందిన సురేష్ సింగ్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించేలా యాజమాన్యంతో సిఐటియు, కార్మికులు చర్చలు జరిపారు. కార్మికుని కుటుంబానికి నిబంధనల ప్రకారం వచ్చే వాటితో సహా రూ.2లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉపాధి, పోస్టుమార్టం, మృతదేహాన్ని ఇంటికి చేరవేయటానికి, దహనానికి అయ్యే ఖర్చులను కంపెనీ యాజమాన్యమే భరించేలాగా కాంట్రాక్టర్ అంగీకరించారు. అప్పారావు కుటుంబానికి న్యాయం చేసేందుకు మృతుడు పని చేస్తున్న కాంట్రాక్టర్ కిషోర్ కనస్ట్రక్షన్ యాజమాన్యంతో చర్చలు జరుపుతామని వెల్లడించారు.

ఆరు నెలలుగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంటాక్టు కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు వివి రమణ ఆవేదన వ్యక్తంచేశారు. పనిచేసే చోట కార్మికుడు మృతిచెందినా చూడటానికి తోటి కార్మికులను వెళ్లకుండా ఇంజినీరింగ్ ఇన్‌ఛార్జి, హెచ్ఒడి, పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు.

కార్మికులపై తీవ్ర ఒత్తిడి : సిఐటియు

యాజమాన్యం కార్మికులను తగ్గించి ఉత్పత్తిపై కేంద్రీకరించి కార్మికుల భద్రతను పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్పత్తిపై దృష్టి కేంద్రకరించి కనీసం పని ప్రదేశం సురక్షితంగా ఉందో లేదో చూసే సమయం కూడా ఇవ్వకుండా కార్మికులపై తీవ్ర పని ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు. ఇప్పటికే ప్లాంట్లో అనేక స్ట్రక్చర్లు దెబ్బతిన్నాయని వివరించారు. తక్షణమే యాజమాన్యం మెయింటెన్స్, భద్రతపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోకి అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఒక వ్యాను గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొన్న ఘటన జాతీయరహదారి డెయిరీఫారం సమీపంలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. తీవ్రగాయాలతో పడివున్న వ్యక్తిని కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ రామ్‌దాస్ కథనం ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత శ్రీకాకుళం నుంచి నగరంలోకి అక్రమంగా ఆవులను తరలిస్తూ వస్తున్న వ్యాన్ డెయిరీఫారం సమీపంలో విమ్స్ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని బలంగా ఢీకొట్టి, ఆవులతో కూడిన వ్యాను బోల్తా పడింది. ఈ ఘటనలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌కు, గోవులకు ఎటువంటి ప్రాణ నష్టం లేదు. ఆరిలోవ ఎస్ఐ రామదాసు ఆవులను అక్రమంగా తరలించడంపైనా, రోడ్డు ప్రమాదంలో మృతి ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గోపాలపట్నం : చోరీకి పాల్పడిన ముగ్గురిని, చోరీచేసిన బంగారు అభరణాలను గోపాలపట్నం పోలీసులు రికవరీ, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపట్నం పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గోపాలపట్నం దరి లక్ష్మీనగర్‌లో యరబాల నారాయణరావు కుటుంబంతో నివాసముంటున్నారు. ఈ నెల 9వ తేదీన ఇంటికి తాళంవేసి పెళ్లి నిమిత్తం శ్రీకాకుళం వెళ్లారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంటిలోని ఐదున్నర తులాల బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితుడు యరబాల నారాయణరావు ఫిర్యాదు మేరకు గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ తేజేశ్వరరావు ఆధ్వర్యాన దర్యాప్తుచేపట్టారు. సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు చేశారు. లండగరువు అడవివరం వద్ద అనుమానితులు కొత్తపల్లి జయరాం (26), ఇత ఇంద్ర (24), బోగాది అప్పలనాయుడు (54)ను అదుపులోకి తీసుకొని విచారించారు. బాధితుడు నారాయణరావుకు పరిచయస్తుడైన బోగాది అప్పలనాయుడుకు శ్రీకాకుళం పెళ్లికి వెళ్తున్నట్లు చెప్పడంతో పథకం ప్రకారం అప్పలనాయుడు, ఇంద్ర, జయరాం చోరీచేసినట్లు అంగీకరించారు. వీరిని అరెస్టుచేసి, తస్కరించిన బంగారు అభరణాలను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మొబైల్ ఫోన్ల రికవరీ

ప్రజాశక్తి-గోపాలపట్నం : పోయిన 17 సెల్ ఫోన్లను పోలీసులు రికవరిచేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వివిధ వ్యక్తుల నుంచి సెల్ ఫోన్లు రికవరిచేశామని గోపాలపట్నం వెస్ట్ సబ్‌డివిజన్ సిఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ప్రాపర్టీ మెళాలో ఈ సెల్ ఫోన్లను నగర పోలీసు కమిషనర్‌కు అందజేస్తామని చెప్పారు.

బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి- రావికమతం: బహిర్భూమికి వెళ్లిన వివాహిత ప్రమాదవశాత్తు నేల బావిలో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలో గర్నికం పంచాయతీ శివారు కానాడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి. గర్నికం పంచాయతీ శివారు కానాడ గ్రామంలో పసలపూడి శివలక్ష్మి (30) సోమవారం బహిర్భూమికి వెళ్లింది. ప్రమాదవశాత్తు నేల బావిలో పడడంతో చనిపోయి ఉండవచ్చని మృతురాలి భర్త చిరంజీవి రావికమతం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘువర్మ తెలిపారు. 13 ఏళ్ల క్రితం చిరంజీవితో వివాహమైన లక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

మందుబాబులకు జైలు శిక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నలుగురిలో ఇద్దరికి జరిమానా, మరో ఇరువురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో నలుగురు పట్టుబడగా, వారిని ఎలమంచిలి కోర్టులో ప్రవేశపెట్టామన్నారు వీరిలో ఇద్దరికి చెరో రూ. 10 వేల చొప్పున జరిమానా విధించగా, మరో ఇద్దరికీ చెరో 4 రోజులు పాటు జైలు శిక్ష విధిస్తూ ఎలమంచిలి కోర్టు జడ్జి సోమవారం తీర్పు చెప్పారని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

గాజువాక అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి- గాజువాక/ ఉక్కునగరం : పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక అభివృద్ధికి పలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఆయన తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, పలువురు కార్పొరేటర్లతో కలిసి 65, 66, 73, 76, 87 వార్డులలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గాజువాకలోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. కొత్త గాజువాక జంక్షన్ నుండి బాల చెరువు రోడ్డును 40 నుండి 100 అడుగుల రోడ్డుగా విస్తరణ చేపట్టాలని, ఆ మార్గంలో పలుచోట్ల కాలువలు మరమ్మత్తులు, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం జంక్షన్ నుండి ఉన్న 100 అడుగుల రోడ్డును 140 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టడంతో పాటు సర్వీస్ రోడ్డు, అండర్ కేబుల్ వర్క్, సెంటర్ మీడియన్, కాలువలు ఏర్పాటు చేయాలని, 76వ వార్డులోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వల్ల దుర్వాసన వెదజల్లి ప్రజలు ఇబ్బంది పడుతూ అనారోగ్యానికి గురవుతున్నందున తగిన పరిష్కారం చూపాలని, ఆ ప్రాంతంలో ఉన్న గెడ్డలో పూడిక తీత పనులు చేపట్టాలని, 73వ వార్డులోని ఆదర్శ గ్రౌండ్‌ను అభివృద్ధి పరచాలని, 87వ వార్డు పరిధి వడ్లపూడి ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని, వడ్లపూడిలో ఉన్న 4 ఎకరాల స్థలాన్ని స్పోర్ట్స్ ఎరీనాగా అభివృద్ధి చేయాలని, ఎమ్‌వివి, ఎమ్‌కె పార్కు పక్కన ఉన్న స్థలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ సమస్యలపై జివిఎంసి కమిషనర్ స్పందిస్తూ గాజువాక జంక్షన్ నుండి బాల చెరువు రోడ్డులో ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి 100 అడుగులు రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, శిథిలా వ్యవస్థలో ఉన్న కాలువల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం జంక్షన్ నుండి వున్న 100 అడుగుల రోడ్డు 140 అడుగుల రోడ్డు విస్తరణ, ఇరువైపులా ఫుట్‌పాతులు, అండర్ గ్రౌండ్ కేబుల్, సెంటర్ మీడియన్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. 76వ వార్డులో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో ఉన్న కొత్త పోర్టబుల్ కంపాక్ట్ వాహనాలను ఎందుకు వినియోగంలోకి తీసుకు రాలేదని ఆరా తీస్తూ, అవి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని, డంపింగ్ యార్డ్ లో 105 వాహనాలతో నిత్యం వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేయడం వల్ల దుర్గంధం వెదజల్లుతుందని, అందుకు ప్రత్యేకంగా డంపింగ్ యార్డులో వాహనలు రాకపోకలకు వీలుగా ఒక రోడ్డు మార్గం అలాగే మధ్యలో చిమ్ని ఏర్పాటు చేసినట్లయితే వ్యర్థాలు ఒకచోట వేయడానికి వీలుంటుందని, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన క్లోజ్డ్ డంపింగ్ యార్డ్‌గా నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని, అలాకాని యెడల డంపింగ్ యార్డును మరోచోటికి తరలించేందుకు స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. డంపింగ్ యార్డ్ పక్కన ఉన్న గెడ్డలోని పూడిక తీత పనులు చేపట్టాలని, అవసరమైతే గెడ్డ వద్ద ఒక మురికి నీటి శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజనీరు గోవిందరావును ఆదేశించారు. 87 వార్డు వడ్లపూడి ప్రధాన రహదారిలోని ఆక్రమణలు తొలగించి రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎమ్‌వివి, ఎమ్‌కె పార్కు సమీపంలో నీటి సరఫరా ప్లాంట్‌ను నిర్మించడానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, బొడ్డు నరసింహ పాత్రుడు, బొండా జగన్నాథం, జివిఎంసి జోనల్ కమిషనర్ బిఆర్‌ఎస్.శేషాద్రి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్‌కుమార్, డిడిహెచ్ ఎమ్.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల బాల బాలికలకు అల్బెండజోల్ మాత్రలను అన్ని విద్యా సంస్థల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా పంపిణీచేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హరిక తెలిపారు. జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల మధ్య 5,15,264 మంది బాల బాలికలు ఉన్నారని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలను 1 నుండి 2 సంవత్సరాల వయసు గల పిల్లలకు సగం మాత్రను, 2 నుండి మూడేళ్ల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలని తెలిపారు. 3 నుండి 19 సంవత్సరాల వయసు గల వారికి పూర్తి మాత్రను చప్పరించేటట్లు చూడాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తరవాత మాత్రలను వేయాలని తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్నీ ఏర్పాట్లూ చేసినట్లు వివరించారు.

రిజిస్ట్రేషన్ పూర్తిచేసి స్కీమ్ ఇళ్లను అందించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : తాటిచెట్లపాలెం ఎఎస్‌ఆర్.నగర్‌లోని ప్రభుత్వ స్కీం ఇళ్లను రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం జిల్లా నాయకులు వై.రాజు మాట్లాడుతూ, ఇళ్లు వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి ఇవ్వకపోవడం దారుణం అన్నారు. స్కీమ్ ఇళ్లకు ఇంటి పన్ను వెయ్యాలని, తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జోనల్ కమిషనర్ రాముకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు అప్పన్న, జయరాజు తదితరులు పాల్గొన్నారు

టార్గెట్‌బాల్ పోటీల్లో నిఖిల్ ప్రతిభ

ప్రజాశక్తి-సీతమ్మధార : చాగల్లులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల బిఎస్‌సి తృతీయ సంవత్సర విద్యార్థి ఆర్.నిఖిల్ జూనియర్ బాయ్స్ విభాగంలో, మిక్స్‌డ్ టీం విభాగంలో స్వర్ణ పతకాలను, టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్‌ఎస్ లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలిలోని కలిగొట్ల స్వీర్ణ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన భీమిలి ఫుట్ బాల్ గ్రౌండ్‌లో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరుగు స్వీర్ణ శ్రీదేవి ఫుట్ బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌కు సంబంధించి పోస్టర్‌ను సోమవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. చిట్టివలసలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన టోర్నమెంట్ నిర్వాహకులతో కలిసి పోస్టర్‌తో పాటు ట్రోఫీలను, బాల్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి, మాజీ కౌన్సిలర్లు గొలగాని నరేంద్రకుమార్, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యాన గంభీరం గ్రామంలోని హరే కృష్ణ వైకుంఠం, శ్రీ శ్రీ రాధా మదన మోహన్ మందిరంలో జరుగుతున్న హెరిటేజ్ ఫెస్ట్-2025లో సోమవారం సృజనాత్మక పోటీలు నిర్వహించారు. ఆగస్టు 2 నుంచి ప్రారంభమైన ఈ సాంస్కృతిక మహోత్సవం సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజైన సోమవారం కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలు జరిగాయి. 20 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

వినియోగంలోకి బోరు

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలో ప్రభుత్వ మంచినీటి బోరును ఆక్రమించి జరుగుతున్న అక్రమ గృహనిర్మాణంపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహశీల్దార్ శ్రీనుబాబు ఆదేశాల మేరకు ఆర్ఐ అవినాష్, విఆర్ఒ అప్పారావు, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంచినీటి బోరు చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, బోరును మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చారు. బోరు చుట్టూ సిమెంట్‌తో పనులు చేయించి మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ బోర్ల స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

అగనంపూడి ఆసుపత్రి డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి వైద్య విధాన పరిషత్‌లో కొత్తగా ఎన్నికైన నలుగురు డైరెక్టర్లచే అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. డైరెక్టర్లుగా ఎన్నికైన దాసరి త్రినాధరావు, కోసూరి తాతారావు, డొక్కా రమేష్, గజ్జల రమణమ్మచే ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను ఎమ్మెల్యే అందించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధి కోసం ఈ కమిటీ నిరంతరం కష్టపడాలని సూచించారు. ఓపి ఎక్కువ ఉన్న రోజుల్లో ప్రజలకు తగ్గ అవసరాలు చేకూర్చాలని, ఇక్కడికి వచ్చే బడుగు బలహీన వర్గాల రోగులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా చూడాలని చెప్పారు. ఇక్కడికి వచ్చే రోగులు పేదవారని, వారికి తగిన వైద్యం అందించి ఆదుకోవాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, కూటమి నాయకులు దినంకొండ కృష్ణంరాజు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

విమాన్‌నగర్ రోడ్డును పరిశీలిస్తున్న గణబాబు

విమాననగర్ రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖపట్నం ఎయిర్ పోర్టు నుంచి విమాననగర్ రోడ్డును ఇంజినీరింగ్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ గణబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తపాలెం, విమాననగర్ నుంచి వచ్చే ద్విచక్ర వాహన ప్రయాణికులు రాంగ్ రూట్‌లో ఎయిర్ పోర్ట్ జంక్షన్‌కు వెళ్తున్న మార్గానికి ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్టు సిగ్నల్ జంక్షన్‌కు కాంకర్ కంపెనీ రోడ్డు మధ్య ఉన్న గ్రీన్ బెల్ట్‌లో విమాననగర్ రోడ్డుకు ద్విచక్ర వాహన ప్రయాణానికి ప్రణాళికలు ప్రతిపాదించాలని సూచించారు. కమిషనర్ దృష్టిలో పెట్టి అప్రూవల్ తీసుకుని ద్విచక్ర వాహనదారులకు వెసులుబాటు కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు యలమంచిలి ప్రసాద్, అరుణ్, విమాననగర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీ ఆంత్రోపాలజీ విభాగంలో సోమవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మూవ్‌మెంట్-21 సంస్థ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ప్రస్తుతం ఆదివాసీల సంస్కృతిపై దాడి జరుగుతోందన్నారు. ప్రకృతిని మాత్రమే ఆరాధించే ఆదివాసీల సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. ఆంత్రోపాలజీ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ డి.రమేష్ మాట్లాడుతూ, మానవ పరిణామ క్రమాన్ని, ఆదివాసీల పురాతన, ఆధునిక జీవన విధానాన్ని వివరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు అమలు కావటం లేదని, వాటిని అమలుచేసుకునేలా సమాజాన్ని చైతన్యం చేయాలని సూచించారు. ఆంధ్ర యూనివర్సిటీ షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయీస్ అధ్యక్షులు ప్రసాదరావు మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితిలో

మాట్లాడుతున్న ప్రొఫెసర్ పల్లవి

ఆదివాసీ దినోత్సవాన్ని ఏ రకంగా నిర్ణయించారు, దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి మూవ్‌మెంట్-21 నాయకులు డాక్టర్ బి.మృత్యుంజయ్, విశాఖ జిల్లా కన్వీనర్ బెన్నీ శివకుమార్, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విరమణలతో పని భారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రతినెలా ఉద్యోగ విరమణ చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పని భారం పడుతోందని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. జివిఎంసి 88వ వార్డు పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం దువ్వాడ సెక్టర్-5 మస్టర్ పాయింట్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొలగాని అప్పారావు మాట్లాడుతూ, ప్రభుత్వం డెత్, రిటైర్మెంట్ కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పించడం లేదన్నారు. తాతల కాలం నాటి డేట్ ఆఫ్ బర్త్ ఆధారంగా రిటైర్మెంట్ ప్రకటించిన ఆప్కాస్ అర్హత ఉన్నవాళ్లను కూడా తొలగిస్తున్నారని తెలిపారు. వయస్సు ఉన్నట్లు ఆధారాలు ఉన్నా తొలగిస్తున్నారని, దీనిపై కమిషనర్ శ్రద్ధ పెట్టి రీ ఎంట్రీ డేట్ ఆఫ్ బర్త్ నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ, లక్ష్మి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు గురుకుల విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకాశం జిల్లా, చేపూరులో ఈ నెల 29, 30, 31 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు విశాఖ జిల్లా తరపున స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.రామలక్ష్మి, పిఇటి ఎం.మహాలక్ష్మి, బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ మండల కార్యదర్శి మా కాల శంకరరావు సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు ఆర్.లాస్యశ్రీ, ఎ.భవన, బి.సిరి ప్రసన్నలను కళాశాలలో ప్రిన్సిపల్, పిఇటి, బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 10వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లాల బాల బాడ్మింటన్ అండర్ 16 సబ్ జూనియర్ టోర్నమెంట్ ఎంపిక పోటీలు అచ్యుతాపురం మండలం, నునపర్తి గ్రామంలో జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన విషయం విదితమే. ఈ పోటీల్లో పాల్గొన్న ఎపి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లాకు, రాష్ట్రానికి, చదువుకున్న పాఠశాలకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు.

శిరీషకు అభినందనలు

ప్రజాశక్తి- పద్మనాభం : రాష్ట్రస్థాయిలో ఈ నెల 21న జరుగునున్న యోగాలో పాల్గొనేందుకు జిల్లా స్థాయి నుంచి ఎంపికైన చలపాక శిరీషను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. విశాఖ జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.రమణ, ఎం.అప్పలనాయుడు, ఆవారి తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ఆదుకోండి

విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో ఆటో డ్రైవర్ల ర్యాలీ, ధర్నా

విశాఖలో ఆటోలతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైల్వే స్టేషన్ వద్ద నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు, అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తామంతా ఇబ్బందుల్లో ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలో వాహన మిత్ర ద్వారా రూ.15 వేలు ఏటా ఇచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. మోటార్ కార్మికులకు నష్టం కలిగించే జిఒ 21ని రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్‌ను రాయితీపై అందివ్వాలని, కేరళ మాదిరిగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కర్రి గణేష్, కె.రాము, కెవి.రమణ, బాబ్జి, అలీ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి హెచ్.కాసుబాబు, షేక్ రహిమాన్ పాల్గొన్నారు.

అనకాపల్లి : ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని, పెంచిన ఇన్సూరెన్స్, టాక్స్‌లు, ఫిట్నెస్ చార్జీలను తగ్గించాలని, ఆటో మోటార్ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ ఆటో, మోటార్ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకొస్తామని, వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చాక వాటి అమలుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ కార్యక్రమం ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు జి.దేముడు నాయుడు, ఆర్.రాము, సోమునాయుడు, సంతోష్, రాము, శ్యామ్, దుర్గారావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఇబ్బందుల్లేకుండా విద్యుత్ సరఫరాకు కృషి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : 'అర్ధరాత్రి విద్యుత్ కోతలు' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో శనివారం ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో పది రోజులుగా అర్ధరాత్రి సమయాల్లో విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనంపై ప్రజాశక్తి కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ ఎడి సురేష్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా వర్షాలు పడడం, ఈదురు గాలులు వేయడంతో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరాను అప్పుడప్పుడు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా ఇవ్వడానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి-చోడవరం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి చోడవరం డిగ్రీ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాపకులకు సాధారణ బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న అధ్యాపకుల స్థాయిని సహాయ ఆచార్యులుగా మార్పు చేయాలని పలు దఫాలుగా విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ బదిలీలు అన్ని శాఖలలో చేయగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంతవరకు చేపట్టలేదని, ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్న డిజిగ్నేషన్ను మార్పు చేయాలని, జీవో నెంబర్ 42ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్‌కు 291 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)కు 291 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యన్నారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, రామామణి, డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, వ్యవసాయ అధికారి మోహన్‌రావు, డిఆర్‌డిఎ, గృహనిర్మాణ, డ్వామా, మెప్మా పీడీలు శచీదేవి, శ్రీనివాస్, పూర్ణిమ దేవి, కె సరోజినీ, డిపిఒ సందీప్, డిఎంహెచ్ఒ ఎం.హైమావతి, ఎక్సైజ్ అధికారి వి.సుధీర పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 35 ఫిర్యాదులు

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా 35 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో భూ తగాదాలు 25, కుటుంబ కలహాలు 4 ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి, వాస్తవంగా నిర్ధారించిన వెంటనే చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సై వెంకన్న, పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి శివాలయం వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.సత్యనారాయణ మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు డిసెంబర్ వరకు అవకాశం

మాట్లాడుతున్న ప్రసాద్

ప్రజాశక్తి-అనకాపల్లి, చోడవరం : అదనపులోడు క్రమబద్ధీకరణ కొరకు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్ జి.ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అదనపులోడు క్రమబద్ధీకరణ కొరకు ఈ ఏడాది మార్చి నుండి జూన్ నెల వరకు 50శాతం రాయితీపై చెల్లించవచ్చినని, సంస్థ ప్రకటించడంతో జిల్లాలో 7010 మంది వినియోగదారులు క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు. వినియోగదారుల అభ్యర్థన మేరకు ఈ ఏడాది చివరి వరకు అదే విధంగా చెల్లించుకోవచ్చునని ప్రసాదు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడి వై సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14, 15న వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో గల గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవాన్ని ఈనెల 14, 15 తేదీలలో జయప్రదం చేయాలని మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అచ్యుతాపురంలో గల తన నివాసంలో కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ వార్షికోత్సవంలో భాగంగా 14న స్థానిక నందీశ్వర ప్రాంగణంపై రాత్రి 7.30 గంటలకు పెందుర్తి గౌరీ నటరాజ డ్రమేటిక్ అసోసియేషన్ వారిచే "భీమ.. భీమ ..ఎందు కుట్టావు?", 8.30 గంటలకు "మాతృదేవోభవ" నాటికల ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 15న ఉదయం 8 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ, 10.30 గంటలకు యువతీ, యువకులకు ఆటల పోటీలు, రాత్రి 7.30 గంటలకు మునగపాక ఐ కిడ్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ వారిచే కూచిపూడి, భరతనాట్యం కళా ప్రదర్శనలు, రాత్రి 9 గంటలకు మునగపాక నటరాజ ఆర్ట్స్ వారిచే "గీత దాటితే" నాటిక ప్రదర్శన ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి పరశురాం, ఏవి సత్యనారాయణ, కాళ్ళ చంద్రమోహన్, ఎల్లపు వెంకట భాస్కరరావు పాల్గొన్నారు.

మొల్లోడు గెడ్డలో రసాయనిక వ్యర్థ జలాలను తోడించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని మొల్లోడు గెడ్డలో ఫార్మా రసాయనిక వ్యర్థ జలాలను తోడించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొల్లోడు గెడ్డలో వ్యర్థ రసాయనిక జలాలను సోమవారం గనిశెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా సిటీలో శుద్ధిచేసి సముద్రానికి పంపించవలసిన వ్యర్థ రసాయనిక జలాలను సిఈటిపి నుండి నేరుగా మొల్లోడు గెడ్డలోకి విడుదల చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాంకీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. ల్యాండ్ ఫిల్ నిండిపోవడంతో ఘన వ్యర్థాలను కూడా కోస్టల్ వేస్ట్ మేనేజ్మెంట్‌లో బహిరంగ ప్రదేశంలో రాంకీ యాజమాన్యం వేస్తుందని, దీంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాల నాశనమవుతున్నాయని, పర్యావరణం, ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తానాం పక్కన అక్రమంగా చెరువు తవ్వకాలు చేసి వ్యర్థ జలాలు నిల్వ చేయడానికి ప్రయత్నించారన్నారు. పరవాడ, భరిణికం, తానాం, తాడి, లంకెలపాలెం, ఈ బోనంగి, సాలాపువానిపాలెం చుట్టూ ఉన్న గ్రామాలు తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు నడుస్తుందని ఒకవైపు కేసు నడుస్తున్నా రాంకీ యాజమాన్యం బరితెగించి అక్రమాలకు, చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

4 పిఎసిఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

దొడ్డి కిశోర్, దొండ శ్రీను

అప్పలనాయుడు, సత్యనారాయణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు గాను నాలుగు పిఎసిఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయరామరాజుపేట పిఎసిఎస్ చైర్మన్‌గా దొడ్డి కిషోర్, డైరెక్టర్లుగా జొన్న భీమనాయుడు, భీశెట్టి వెంకటరమణ, బంగారుమెట్ట పిఎసిఎస్ చైర్మన్‌గా దొండ శ్రీను, డైరెక్టర్లుగా సాయం అయ్యన్న దొర, ఎ.సాంబమూర్తి, బుచ్చయ్యపేట పిఎసిఎస్ చైర్మన్‌గా దొంకిన అప్పలనాయుడు, డైరెక్టర్లుగా పెద్దిరెడ్డ శ్రీను, మొల్లి ఈశ్వరరావు, తురకలపూడి పిఎసిఎస్ చైర్మన్‌గా కోట సత్యనారాయణ, డైరెక్టర్లుగా కంద మూర్తి, కలగా నాగేశ్వరరావులను నియమించారు. అయితే వడ్డాది, పొట్టిదొరపాలెం పిఎసిఎస్‌ల త్రిసభ్య కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి.

దొండా శ్రీనుకు అభినందనలు

వడ్డాది : బంగారు మెట్ట పిఎసిఎస్ అధ్యక్షులుగా నియమితులైన దొండ శ్రీనును ఎంపీటీసీ యల్లపు జగ్గారావు, టిడిపి టౌన్ అధ్యక్షుడు సాయం శేషు, మాజీ సర్పంచ్ తామరాన దాసు, పలువురు నాయకులు సోమవారం అభినందించారు.

పైడివాడ ఎన్‌టిఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం పంచాయతీ శివారు పైడివాడ ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని మాజీ సర్పంచ్, విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షులు దాసరి వెంకటరమణ సోమవారం స్థానిక ఇన్‌ఛార్జి ఎంపిడివో కె.శివప్రసాద్ నారాయణరావుకు పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 2016-17లో పైడివాడ సర్వేనెంబర్ 152లో సుమారు 76 మందికి ఎన్టీఆర్ కాలనీ ఇల్లు మంజూరు చేయగా, ఇంటి నిర్మాణం కూడా పూర్తయిందని తెలిపారు. కాని ఇళ్ల పట్టాలు ప్రభుత్వం లబ్దిదారులకు అందజేయలేదన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చినప్పుడు నుండి ఇంతవరకు పంచాయతీ నుండి ఎటువంటి అభివృద్ధి పనులకు తమ కాలనీ నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలవలు, వీధిలైట్లు వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఇంటింటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గండి బాబ్జికి, జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు, స్థానిక తహసీల్దారుకు వినతి పత్రాలను పంపించినట్లు తెలిపారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న దాసరి వెంకటరమణ

జిల్లాస్థాయి యోగా పోటీల్లో జయలక్ష్మి ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం : జిల్లాస్థాయి యోగ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న పండూరు జయలక్ష్మి ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్ తెలిపారు. విశాఖపట్నం జిల్లా యోగా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో జయలక్ష్మి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ మేరకు జయలక్ష్మిని ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్, కళాశాల అధ్యాపకులు, ఎంవి రామకృష్ణ , డాక్టర్ గణేష్ లెక్కల అభినందించారు.

నూతన సాంకేతికతను వినియోగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతన సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తన కార్యాలయం నుండి జిల్లా పోలీస్ అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ పనితీరును సమీక్షిస్తూ అధికారులకు పలు ముఖ్య సూచనలు చేశారు. నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి, నిందితులను అరెస్టు చేయడం, నిర్దీత సమయానికి చార్జిషీట్ దాఖలు చేయడం అనివార్యమని పేర్కొన్నారు. నూతన సాంకేతిక సేవల వినియోగం లో భాగంగా "ఈ సాక్ష్య" యాప్, "ఈ సమన్స్", ఆన్లైన్ ఫిర్యాదులు, జీరో ఎఫ్ఐఆర్ వంటి సాంకేతిక విధానాలను పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా, విస్తృతంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు పాల్గొన్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలి

కలెక్టరేట్ వద్ద రైతులు, కార్మికుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి : దినదిన గండంగా ఉన్న గోవాడ చక్కెర కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని కోరుతూ రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే సీజన్లో ఫ్యాక్టరీ నడుపుతారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారని, దీనిపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో ఉన్న ఏకైక సహకార చక్కెర కర్మాగారానికి రూ.100 కోట్లు కేటాయించి ఆధునికీకరణ చేసి ఫ్యాక్టరీని ఆదుకోవాలని కోరారు. రైతులు, కార్మికులకు గత సీజన్లో బకాయి పడ్డ రూ.30 కోట్లు చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు యు.తాతారావు, రమణ, ఏడువాక శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు ఎస్.రాము నాయుడు, సిఐటియు నాయకులు వి.శ్రీనివాసరావు, గంట శ్రీరామ్, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, ఎస్వీ నాయుడు, గండి నాయన బాబు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దు, విద్యుత్ వినియోగదాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్కు పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్య బాబు సోమవారం వినతి పత్రము అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల తమ వాడకం కన్నా ఎక్కువ బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అదనపు భారాలను రద్దు చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులు వసూలు చేసే కేంద్రాల్లో ఇచ్చే బిల్లులు వేగంగా ముద్రణ చెరిగిపోతుందని, అందువలన ఫైల్ చేసుకోవడానికి అనుకూలంగా వుండే బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలందరూ అదాని కంపెనీ విద్యుత్ మీటర్లు బిగించుకోవాలని ప్రభుత్వం ప్రకటన ఏమీ చేయలేదని, అందువల్ల అక్రమంగా ఒత్తిడి చేసి స్మార్ట్ మీటర్లు బిగించవద్దని విద్యుత్ శాఖను నియంత్రించాలని కోరారు.

మిడ్డేమీల్స్ కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-పరవాడ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షులు కె.ఆదిలక్ష్మి, గౌరవాధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. మండలంలోని వాడ చీపురుపల్లి పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా పాఠశాలల్లో వంట చేస్తున్నా నేటికీ కేవలం రూ.3,000 మాత్రమే వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాడచీపురుపల్లి పాఠశాలలో ఎనిమిది మంది వంట చేస్తుండగా, నలుగురికే జీతం వస్తోందని, దానినే అందరూ పంచుకుంటున్నారని తెలిపారు. ఇది ఎంత అన్యాయమో ప్రభుత్వం గుర్తించాలన్నారు. 450 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 150 గ్రాముల బియ్యం, ఒక గుడ్డు మాత్రమే ప్రభుత్వం ముందుగా ఇస్తుందని, మిగతా కందిపప్పు, నూనె, గ్యాస్, కూరగాయలు, పోపులు, ఆకుకూరలు మొదలైనవి కార్మికులే ముందుగా డబ్బు పెట్టి కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం డిపో ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు, గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు యూనిఫారం, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడ్డేమీల్స్ కార్మికులు జి.లక్ష్మి, కె.రత్నకుమారి, పి.నాగమణి, గాజుల సత్యవతి, కె.పైడితల్లి, ఏ.నూక రత్నం, కె.లక్ష్మి పార్వతి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల మార్గదర్శకుల గుర్తింపు వేగవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : బంగారు కుటుంబాలు, వారి మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పి4-బంగారు కుటుంబం కార్యక్రమం పురోగతిని, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద మద్దతు ద్వారా పేదరికం లేని సమాజాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్న పి4-బంగారు కుటుంబం కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచటానికి కృషి చేయాలని కోరారు. వినియోగదారులకు విద్యుత్ ఖర్చులను తగ్గించడమే పిఎం సూర్య ఘర్ పథకం లక్ష్యం కనుక ప్రతి కుటుంబం ప్రయోజనం పొందేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు.

మంచినీటి పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అమృత స్కీమ్ పైప్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసిపి నాయకులు జాజుల రమేష్ సోమవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జోన్లో ఏడాది కాలంగా ఇంటింటికి కుళాయిలు ప్రభుత్వం అమృత స్కీమ్ కింద వేసిందని, కాని ఆ మంచినీటి పైప్‌లైన్లు పాడై నీటి సమస్యలు వస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఇది తమ పరిధిలోకి రాదని, దీనికి ప్రయివేట్ కాంట్రాక్టర్ ఉన్నారని చెబుతున్నారని తెలిపారు. ఇంటి పన్నుతో పాటు కుళాయి పన్ను కూడా వసూలు చేస్తున్న జివిఎంసి దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, కొడుకుల సుబ్రహ్మణ్యం, నడిశెట్టి గోవింద్, తంగేళ్ల రామకష్ణ, కోన ఉమా, రెడ్డి చిన్న, చింతా రాంజీ, మేడిశెట్టి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తుకు తుదిగడువు 26

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు మినహా మిగిలిన అన్ని కేటగిరీల్లో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు 2025లకు అర్హత ఆసక్తిగల ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ అప్పారావు నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

21న జిల్లా సమాచార శాఖ వాహనానికి బహిరంగ వేలం

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాచార పౌర సంబంధాల శాఖ, అనకాపల్లి కార్యాలయంలోని వీడియో కవరేజ్ వాహనానికి ఆగస్టు 21వ తేదీ ఉదయం 11 గంటలకు కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్వీ. రమణ తెలిపారు. కాలపరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న మహీంద్రా నిస్సాన్ (ఏపీ 31 టి 5083, 1993 మోడల్) వాహనాన్ని బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1,000 ధరావతు సొమ్ము చెల్లించవలసి ఉంటుందని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో సహా మొత్తం నగదు వెంటనే చెల్లించాలని కోరారు. వాహనాన్ని కార్యాలయ పని వేళల్లో పరిశీలించవచ్చని, వేలం వేయడం, రద్దు చేసే అధికారం కార్యాలయ అధికారికి ఉందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 9100442488 నెంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

14న రైతు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసిన నేపథ్యంలో ఈ నెల 14న నిర్వహించు రైతు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక రింగ్ రోడ్లో జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనసేన, తెలుగుదేశం, బిజెపి కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ 14న సాయంత్రం అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్లో వద్ద ట్రాక్టర్లతో ర్యాలీ ప్రారంభించి నెహ్రూ చౌక్ వరకు సాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, నాగ శీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ బాలికల జట్టు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్లో సోమవారం శాప్ వాలీబాల్ బాలికల జట్టు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా నలుమూలల నుండి 14 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో ఎంపిక చేసిన 12 మంది విశాఖలో ఈనెల 16 నుంచి 20 వరకు జరుగు జోనల్ పోటీలలో పాల్గొంటారు. అక్కడ గెలుపొందిన జట్టు ఈనెల 21 నుంచి 25 వరకు విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని శాప్ డిఎస్‌డిఓ ఎల్వి రమణ తెలిపారు. ఈ జట్టుకు కోచ్ కం మేనేజర్గా జాతీయ వాలీబాల్ రిఫరీ భీశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఎల్లపు గోవింద, రాపేటి సీతారాం, దాడి ఓం శివ, పీలా రమణారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి, తోటాడ, శిరసపల్లి, వెంకటాపురం గ్రామాలలో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్న సూపర్ సిక్స్ పథకాలు అమలైన పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సుందరపు నీలకంఠ స్వామి, దాసరి అప్పారావు, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

13న ఆలయ భూముల శిస్తు వేలం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట శ్రీవేణుగోపాల్ స్వామి ఆలయం భూములకు శిస్తు వేలం పాట ఈ నెల 13న ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద జరుగుతుందని ఆలయం అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 40 ఎకరాలు 68 సెంట్లు భూమికి 2025 నుండి 2028 వరకు సాగుకు సంబంధించి ఈ వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. కశింకోట మండలం వెదురుపర్తిలో 7 ఎకరాలు 50 సెంట్లు, మునగపాక మండలం తోటాడలో 3 ఎకరాల 46 సెంట్లు, అచ్యుతాపురం మండలం పెదపాడులో ఎకరా 86 సెంట్లు, ఖాజీపాలెంలో 14 ఎకరాలు 10 సెంట్లు, అనకాపల్లి మండలం పిసినికాడలో ఎకరా 39 సెంట్లు, కశింకోట గ్రామీణంలో ఎకరా 70 సెంట్లు ఉన్నాయని దరావత్తు చెల్లించి శిస్తు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వద్దాది : బుచ్చయ్యపేట మండలం ఎల్బిపి అగ్రహారం గ్రామం యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక సోమవారం గ్రామంలోని యాదవ కమ్యూనిటీ హాల్లో జరిగింది. అధ్యక్షుడిగా పల్లా వెంకటేష్, కార్యదర్శిగా మొల్లి యేసు రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లి శ్రీను, బోయిన కొండబాబు పాల్గొన్నారు.

ర్యాలీగా వస్తున్న రైతులు

భూ సేకరణకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : బుచ్చయ్యపేట మండలంలోని ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, మల్లాం పంచాయతీలలో భూసేకరణ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పిజిఆర్ఎస్లో జెసి జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. భూసేకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నట్లు తక్షణమే బుచ్చయ్యపేట తహశీల్దారు, చోడవరం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే భూ సేకరణ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, నవ యువ సమాఖ్య రాష్ట్ర నాయకులు సందారపు భాస్కరరావు, ఆర్.భీమవరం, ఆర్.శివరాంపురం, మల్లాం గ్రామ పంచాయతీల సర్పంచ్లు నమ్మి భవానీ అప్పలరాజు, బలిన అమ్మి నాయుడు, బర్ల శివ, నాయకులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ నూతన కమిటీలకు సత్కారం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మునగపాక, నాగులపల్లి, చూచుకొండ పిఎసిఎస్‌లకు టిడిపి నుండి నుండి నియమించబడిన ఛైర్పర్సన్, డైరెక్టర్లను సోమవారం ఘనంగా సత్కరించారు. మునగపాక పిఎసిఎస్ అధ్యక్షులు విల్లూరు నూక నరసింహారావు, డైరెక్టర్ మళ్లె అప్పలరాజు, చూచుకొండ పిఎసిఎస్ డైరెక్టర్ పెంటకోట రఘురాం, నాగులాపల్లి పిఎసిఎస్ డైరెక్టర్ పంతం జగదీశ్వరరావులను టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అచ్యుతాపురంలోని శిల్పా గెస్ట్ హౌస్లో సోమవారం దుస్సాలువలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కర్రి సాయికృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, కాంగ్రెగుల శంకర్, ఆడారి జానకి, ఉలింగల గోవింద్, సబి శ్రీనివాస్, సూరిశెట్టి అప్పలనాయుడు, దాడి శివ, రౌతు నాగప్పారావు, దాడి భీమనాయుడు పాల్గొన్నారు.

గ్రేడ్-2 కార్యదర్శిగా రఘురాం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రం కోటవురట్ల గ్రామ సచివాలయం-1 గ్రేడ్-2 కార్యదర్శిగా రఘురాం సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన ఇంతవరకు బికె.పల్లి కార్యదర్శిగా పని చేశారు. గ్రేడ్-2 కార్యదర్శిగా ప్రమోషన్‌పై కోటవురట్ల సచివాలయానికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా రాజుపేట కార్యదర్శిగా నరసింహ పనిచేశారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన రఘురాం కోటవురట్ల సచివాలయం-2కు కూడా ఇన్‌ఛార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

ఎట్టకేలకు మొదలైన వరి నాట్లు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల వ్యాప్తంగా వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో వరినాట్లు ఎట్టకేలకు మొదలయ్యాయి. వరహానది పరివాహక ప్రాంతంలో గల అన్నవరం, సుంకపూరు, తంగేడు, కోటవురట్ల, ఎండపల్లి గ్రామాలలో జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. కొద్ది రోజులు కాస్తున్న ఎండ తీవ్రతకు నారుమడులు ఎండిపోయే పరిస్థితి రావడంతో దానిని కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షాలు లేకపోవడంతో నారు ఎదుగుదల లేక నాట్లు ఇప్పడి వరకు వేయలేదు. మండలంలోని మెట్టు ప్రాంతాలైన పాములవాక, నీలుగుంట, లింగాపురం, బోడపాలెం, కొత్తపల్లి రామచంద్రపాలెం, తంగేడు తదితర ప్రాంతాలకు తాండవ నీరు అందాల్సి ఉంటుంది. ఆదివారం విడుదల చేసిన నీరు వారం రోజుల వరకు మండలానికి చేరుకోదని రైతులు అంటున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది వరినాట్లకు ప్రతికూల ప్రభావం చూపిందని రైతులు వాపోతున్నారు.

సహ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాచార హక్కు చట్టం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎపి రైతు సాధికార సంస్థ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ సిహెచ్ లచ్చన్న పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ రైతులకు సమాచార హక్కు చట్టం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్‌కు భూములివ్వం

- 6(ఎ) నోటీసు ఉపసంహరించుకోవాలి
- అధికారులకు నిర్వాసిత రైతుల వినతి

ప్రజాశక్తి- నక్కపల్లి : బల్క్ డ్రగ్ పార్క్‌కు భూములిచ్చేది లేదని జానకయ్యపేట గ్రామ రైతులు స్పష్టం చేశారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, నర్సీపట్నంలో ఆర్‌డిఒ వివి రమణ, నక్కపల్లిలో తహశీల్దార్ నరసింహమూర్తిలను కలిసి వినతిపత్రం అందజేశారు.

నక్కపల్లి మండలం సిహెచ్ లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో జానకయ్యపేట గ్రామ పరిధిలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు 192 ఎకరాల అదనపు భూసేకరణకు మే 27న ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ దినపత్రికల్లో 6(ఎ) నోటిఫికేషన్ జారీ చేశారని, దీనిపై అభ్యంతరాలుంటే 60 రోజులలో తెలియజేయాలని పేర్కొనడంతో గతనెల 25న తామంతా భూసేకరణ వ్యతిరేకిస్తూ, రాతపూర్వకంగా నర్సీపట్నం ఆర్‌డిఒకు, స్థానిక తహశీల్దార్‌కు అభ్యంతరాలను తెలియజేశామన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు భూములివ్వబోమని. ఒకపక్క తామంతా స్పష్టం చేసినప్పటికీ, రైతుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈనెల 6న నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద నర్సీపట్నం ఆర్‌డిఒ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలోనూ మరోమారు తమ అభ్యంతరాలను నిరసన ద్వారా తెలియజేశామన్నారు. తామంతా సన్న,చిన్నకార రైతులమని, కొబ్బరి, జీడిమామిడి తోటల ఫలసాయంతోనూ, పశువులు, గొర్రెలు,మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న తమ జీవనాధారమైన భూములను బల్క్ డ్రగ్ పార్క్‌కు ఇచ్చేస్తే, తామంతా రోడ్డున పడడం ఖాయమని పునరుద్ఘాటించామన్నారు. జానకయ్యపేటతోపాటు అదనపు భూసేకరణ ప్రభావిత దొండవాక, పెద్దతీనార్ల, చిన్న తీనార్ల, ఉపమాక, ఎన్.నర్సాపురం, ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామాల రైతులు సైతం బల్క్‌డ్రగ్ పార్కుకు భూములిచ్చే విషయమై తమ వైఖరి స్పష్టం చేసినప్పటికీ, ప్రభుత్వం, అధికారయంత్రాంగం మొండిగా ముందుకు వెళ్లడం దుర్మార్గమన్నారు. ప్రజలు ప్రాణాలు, పర్యావరణానికి, మత్స్యకారుల ఉపాధికి నష్టం కలిగించే అత్యంత ప్రమాదకరమైన బల్క్ డ్రగ్స్ పార్క్ భూ సేకరణకు ప్రభుత్వం ఇచ్చిన 6(ఎ) నోటీసును ఉపసంహరించుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో నిర్వాసిత కుటుంబాల్లో వివాహితులైన ఆడపిల్లలకూ ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని నక్కపల్లి మండలంలో అమలాపురం పంచాయతీ, మూలపర్ర మహిళలు కూడా ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు దేవర సత్తిబాబు, మామిడి కృష్ణ, చందక శివ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

కొనసాగుతున్న దళిత రైతుల దీక్షలు

దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత రైతులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మాకవరపాలెం మండలం జి. కోడూరు సర్వే నెంబరు. 332లోని క్వారీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపడుతున్న రిలేదీక్షలు సోమవారం 20 రోజుకు చేరుకున్నాయి. అయినా ప్రభుత్వం, అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనాధారమైన భూములను మైనింగ్ మాఫియా నుండి కాపాడుకోవాలని, దళితులను చిన్నచూపు చూస్తూ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దళిత రైతులు, వారి సమస్యల పట్ల ప్రభుత్వానికి చిన్నచూపు ఉన్నట్లు దీన్ని బట్టి స్పష్టమవుతోందనిబిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు ఆరోపించారు. అసెంబ్లీ స్పీకర్ సొంతూరులోనే దళితరైతులు మూడు వారాలుగా ఆందోళన చేస్తుంటే సమస్యపై కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అధిక వడ్డీ పేరుతో టోకరా!

- నర్సీపట్నంలో బోర్డు తిప్పేసిన మరో సంస్థ ఇఫ్కో
- రూ.50లక్షల వరకు పెట్టుబడి పేరిట మోసం
- పోలీసులను ఆశ్రయించిన పలువురు బాధితులు

ఇఫ్కోను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అధిక వడ్డీల ఆశ చూపి సిమ్స్, రాగా, ఐరావత్ వంటి పలు కంపెనీలు ప్రజలను మభ్యపెట్టి కోట్లాది రూపాయలు దోచుకున్న మోసపుచ్చిన సంగతి తెలిసిందే. దాదాపు దశాబ్ద కాలం గడిచిన తర్వాత ఇదే తరహాలో నర్సీపట్నంలో మరో సంస్థ బోర్డు తిప్పేసింది. దీంతో లబోదిబోమంటున్న పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలివి.

నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలో గత డిసెంబర్‌లో ఇంటిగ్రేటెడ్ ఫార్మర్ కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఇఫ్కో) కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఏడాది తిరగకముందే బోర్డు తిప్పేసింది. నిత్యవసర సరుకులు బియ్యం, పప్పులు, ఇతర సామగ్రి పొదుపు సంఘాల మహిళలకు అరువు ఇచ్చి, వారపు వాయిదాలు వసూలు చేసే పద్ధతిలో ఇఫ్కో వ్యాపారం మొదలుపెట్టారు. నర్సీపట్నంలో కొంతమందికి అరువు పద్ధతిలో రూ. వెయ్యి విలువైన సరకులు ఇచ్చారు. వారానికి రూ.250 చొప్పున తిరిగి చెల్లించాలన్నది నిబంధన. ఈ విధానంలో వ్యాపారం చేయడం వల్ల లాభాలు బాగానే వస్తాయని ఆసక్తి ఉన్నవారు ఎవరైనా పెట్టుబడి పెట్టవచ్చని కొందరు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రచారాలు చేశారు. దీంతో సుమారు రూ.50 లక్షల వరకు కొందరు పెట్టుబడి పెట్టారు. వీరందరికీ ప్రతి నెలా రూ.5 వడ్డీ గిట్టుబాటయ్యేలా లాభాలు పంచుతామని ఆశ చూపారు. రెండు, మూడు నెలలు గడిచినా పెట్టుబడికి అనుగుణంగా లాభాలు పంచకపోవడంతో కొందరు ఇఫ్కో యజ మాని పి. శ్రీనివాసరావును నిలదీశారు. రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టిన ఓ మహిళకు రెండు నెలలైనా లాభం ఇవ్వకపోవడంతో ఒప్పందం నుంచి తప్పుకొంటున్నట్లు చెప్పారు. ఒప్పందం రద్దయిన 45 రోజుల తర్వాత పెట్టుబడి, లాభం సొమ్ము తిరిగిస్తామని నమ్మించారు. ఆ గడువు ముగిసినా డబ్బులు ఇవ్వక పోవడంతో మోస పోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయిం చారు. శ్రీనివాసరావు ఆచూకీ లేకపోవడంతో కార్యాలయ నిర్వాహకుడు రెండు నెలల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్టుబడిదారులు ఫోన్ చేస్తే యజమాని ఇదిగో అదిగో అంటు న్నారు. ఆయన ఎక్కడ ఉన్నారోనని కొందరు ఆరా తీయగా తెలంగాణలో ఉన్నట్లు పోలీసుల దృష్టికి తెచ్చారు. ఇఫ్కో మోసాల బారిన నర్సీపట్నం మండలంలో ఓ ప్రజాప్రతి నిధి భర్త, ఓ సోషల్ మీడియా ప్రతినిధి, పలువురు గృహిణులు కూడా ఉన్నారు.

నర్సీపట్నంలో బోర్డు తిప్పేసిన ఇఫ్కో

చట్టాలపై అవగాహన అవసరం

అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్ఐ

ప్రజాశక్తి- నక్కపల్లి : బాలికలకు చట్టాలపై అవగాహన అవసరమని ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ అన్నారు. సోమవారం నక్కపల్లి డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ బాలికల రక్షణకు అమల్లో ఉన్న చట్టాలు, హక్కులపె వివరించారు. బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చున్నారు. శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి వాటిని ప్రతిఘటించాలని సూచించారు. సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు .

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I.A. 5227/2025 in O.S.175/2019

Between:
Gollavilli Kishor Kumar ...Petitioner
And:
Smt. Gollavilli Varalakshmi & others ...Respondents

NOTICE

To
R-4: Kata Naresh,
s/o Kata Sannibabu, Hindu,
Age about 35 years,
R/at # 2-74-4, Madugula
Koduru-531027
Madugula Mandalam,
Narsipatnam, Anakapalli District

Please take Notice that the above named Petitioner herein has filed Petition against you (Respondent No.4) and other Respondents and the matter stand posted to **01-09-2025** for your appearance. You hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **1st September 2025** at **10-30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
A. BHASKARA RAO, Advocate
Visakhapatnam-17,
Cell: 9502089799

ప్రారంభానికి ఎదురుచూపులు

నిర్మాణం పూర్తయిన కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని గొలుగొండ, కృష్ణదేవిపేటలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న పోలీస్ స్టేషన్లు ప్రారంభానికి ఎదురు చూస్తున్నాయి. గతంలో వీటి ప్రారంభోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ అప్పట్లో ప్రారంభించలేదు. కొత్త పోలీస్‌స్టేషన్ భవనాలు వినియోగంలోకి తెస్తే పోలీసులతోపాటు ప్రజలకు మరింత సౌలభ్యంగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం ఆయా పోలీస్‌స్టేషన్లను ప్రారంభించి ,వినియోగంలోకి తెచ్చే చర్యలు చేయాలని పలువురు కోరుతున్నారు.

చకచకా పందూరు వంతెన నిర్మాణం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పందూరు వరహానదిపై వంతెన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి 2014లో నాటి టిడిపి ప్రభుత్వం రూ.ఆరు కోట్లు మంజూరు చేయగా మొదలైన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు, పలు సందర్భాలలో కాలిబాట వంతెన పైనుంచి ప్రమాదాలు సైతం చోటుచేసుకుని మరణించిన దాఖలాలు ఉన్నాయి, 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హోం మంత్రి అనిత చొరవ చూపి రూ. 5.75 కోట్లు నిధులు మంజూరు చేయడంతో మళ్లీ వంతెన పనుల్లో కదలిక వచ్చింది. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతూ ఉండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐదారు నెలల్లో వంతెన పనులు పూర్తి చేస్తామని అందుబాటులోకి తీసుకొస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

జరుగుతున్న వంతెన పనులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహన పత్రాలు తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రామారావు

ప్రజాశక్తి-గొలుగొండ : వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్థానిక ఎస్ఐ పి.రామారావు అన్నారు. సోమవారం గొలుగొండ ప్రధాన రహదారిపై సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లను పరిశీలించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణికులకు రక్షణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, అతిక్రమిస్తే చేపట్టే చర్యలపె వాహనదారుల్లో అవగాహనకు ప్రత్యేక తనిఖీలు చేపట్టామని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

జోనల్ పోటీలకు జిల్లా హాకీ జట్టు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎపి క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలతో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం నక్కపల్లి హాకీ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి బాలురు, బాలికల హాకీ క్రీడాఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఎల్వి.రమణ మాట్లాడుతూ శాప్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పోటీల్లో బాలురు, బాలికల విభాగంలో ఎలమంచిలి నుంచి చెరో ఎనిమిది మంది, అలాగే నక్కపల్లి నుంచి కూడా చెరో ఎనిమిది మందిని ఎంపిక చేశారు.. వీరంతా విశాఖపట్నం జోనల్ స్థాయిలో క్రీడా పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారని వెల్లడించారు. జోనల్ స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు ఎంపికైన క్రీడాకారులకు బిఎస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, జాతీయ సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, హైస్కూల్ హెచ్ఎం విజయ, కోచ్ రాంబాబు, హాకీ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, నానాజీ అడ్డూరి రంజిత్ అభినందనలు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

ఎఎల్.పురం విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ : అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ బాలబాలికల పోటీలు, సెలక్షన్ ట్రయల్స్‌లో ఎఎల్.పురం విద్యార్థులకు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు చొరవతో బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలకు హాజరైన ఏఎల్.పురం జిల్లా పరిషత్ హైస్కూల్, సెయింట్ ఆన్స్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటి, తొలిసారిగా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నారు. ఏఎల్.పురం బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ టీంను అప్ కమింగ్ టీమ్‌గా గుర్తించి క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎస్ఐ తారకేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో పిఇటిలు జి.నాగేశ్వరరావు, మాధవి పాల్గొన్నారు.

మెటల్ క్వారీకి అనుమతులివ్వొద్దు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో గుడివాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 339లో కొండను మెటల్ క్వారీ లీజుకు అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన సీత చిన్నఅప్పారావు సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఇదే సమస్యపై స్థానిక తహశీల్దార్ గ్రీవెన్స్‌లో సర్పంచ్ గుమ్మాల వెంకటలక్ష్మి దేవి, ఎంపీటీసీ కరణం అప్పారావు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ తీర్మానం, గ్రామసభ ఆమోదం లేకుండా దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన మెటల్ క్వారీకి అనుమతులిస్తే ప్రజల ఆరోగ్యానికి, పంటపొలాలు, ఇతర ఆస్తులకు తీవ్రనష్టం జరుగుతుందని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. గ్రామాలను అనుకుని ఉన్న కొండలలో మెటల్, గ్రావెల్, గ్రానైట్ తవ్వకాలకు అనుమతులివ్వడం ద్వారా పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు సర్వనాశనమౌతాయని, గాలి, నీటి కాలుష్యంతోపాటు పేలుళ్ల శబ్దాలతో ధ్వనికాలుష్యం, ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మెటల్‌క్వారీ లీజుకు అనుమతులు ఇవ్వొద్దని వేడుకున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- దుకాణంపై చెట్టు పడి చిరు వ్యాపారికి గాయాలు
- విద్యుత్ సరఫరాకు, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

గాలి బీభత్సానికి కారుపై పడ్డ విద్యుత్ వైర్లు, భారీ చెట్టు కొమ్మ

ప్రజాశక్తి నర్సీపట్నం/ నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో సోమవారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకుని, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది, పలుచోట్ల చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. మోస్తరు వర్షమే కురిసినప్పటికీ, గాలుల బీభత్సంతో ప్రజలు అల్లాడిపోయారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో సమోసా విక్రయిస్తున్న యువకుడిపై చెట్టు విరిగిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. పోలీసులు రంగప్రవేశం చేసి స్థానికుల సహాయంతో చెట్టును తొలగించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, వాసవీమాత గుడివద్ద, రామారావు పేట, గచ్చపువీధిలో ఇలా పలుచోట్ల రోడ్డు అడ్డంగా, కార్లు, దుకాణాలు, ఇతర ఆస్తులపై చెట్లు విరిగి పడ్డాయి. రోడ్డు వెంబడి ఉన్న చెట్లు కూకటివేళ్లలో నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు వెలిసిన వెంటనే మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాలకు చేరుకుని చెట్ల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతు పనులు ప్రారంభించారు. పూర్తిస్థాయిలో సరఫరా పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్టు అధికారులు తెలిపారు చెట్లు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, సరిచేసే చర్యలు చురుగ్గా చేపడుతున్నారు. గాలుల బీభత్సానికి రోడ్డుపక్కనుండే చిరు వ్యాపారులు భయాందోళనలకు గురయ్యారు కురిసిన వర్షానికి రోడ్లపై నీరు ప్రవహించింది.

గాలుల దెబ్బకు విరిగిపడిన విద్యుత్ స్తంభం

జీతాలు నిలుపుదలపై నిరసన

- సిఐటియు ఆధ్వర్యాన ఆశాల ఆందోళన
- బాధ్యుడైన వైద్యాధికారిపై చర్యలకు డిమాండ్

నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాలు

ప్రజాశక్తి- చీడికాడ : చీడికాడ పిహెచ్‌సి కోణాం, సిరిజం సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న ఆశావర్కర్లు నెలసరి జీతాల నిలుపుదలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అకారణంగా ఆపేసిన వేతనాలను తక్షణమే చెల్లించాలని, బాధ్యుడైన వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడుతూ, కోణాం సబ్‌సెంటర్ పరిధిలోని ఆశాలు గరిసింగి లక్ష్మి, సిరగం మల్లేశ్వరిలకు మే, జూన్ రెండు నెలలు జీతాలు నిలుపుదల చేయగా, సిరిజం సబ్‌సెంటర్‌లోని యడ్ల దేవి, ఎం.చిన్నమ్మలు జూన్ నెల వేతనాలను ఎటువంటి కారణం లేకుండా నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. అరకొర వేతనాలతో ఇరవై ఏళ్లుగా ఆశావర్కర్లు పనిచేస్తుండగా, తొలిరోజుల్లో గౌరవవేతనం కూడా లేకుండా స్వచ్ఛందంగా పనిచేసిన సందర్భంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత కార్మికులపై ఒత్తిడి, మానసిన వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఆశావర్కర్లను సబ్‌సెంటర్లలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంచడంతోపాటు వారితోనే సబ్‌సెంటర్లలోని గదులు తుడిపించడం, మరుగుదొడ్లు కడిగించడం, కుర్చీలు మోయించడం వంటి వెట్టిచాకిరీ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇంతలా గొడ్డుచాకిరీ చేస్తున్న ఆశాలకు ఇస్తున్న అరకొర వేతనాలను అకారణంగా నిలిపేయడం దుర్మార్గమన్నారు.బాధ్యుడైన వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో బాధిత ఆశాలు ఎడ్ల దేవి, మల్లేశ్వరి, లక్ష్మి చిన్నమ్మలు తోపాటు కొండమ్మ, కామాక్షి, పార్వతి పాల్గొన్నారు

ముగిసిన అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో గత మూడు రోజుల పాటు నిర్వహించిన సిబిఎస్ఇ క్లస్టర్-7 తెలుగు రాష్ట్రాల బాల బాలికల ఖోఖో పోటీలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు ఉత్సవంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుండి 180కి పైగా జట్లు, 2000 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువుతో పాటుగా క్రీడలకు ప్రాధాన్యమిస్తున్న విద్యార్థులు మంచి శారీరక దఢత్వంతో పాటు, మానసిక ధైర్యం పొంది గెలుపు ఓటమిలను సమాన దృష్టితో చూసే ఆలోచనా దృక్పథం అలవర్చుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు మెడల్స్, జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో సిబిఎస్ఇ పరిశీలకులు సిహెచ్‌ఎల్ఎమ్ శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎమ్.అపర్ణ, కోచ్ లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

అండర్ -19 బాలికల విభాగంలో హైదరాబాద్ సిస్టర్ నివేదిత స్కూల్ ప్రథమ స్థానం, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ ద్వితీయ స్థానం, అండర్ -19 బాలుర విభాగంలో తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ ప్రథమ స్థానం, మహబూబ్ నగర్ ఫార్చ్యూన్ బటర్ఫ్లై స్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. అండర్-17 బాలికల విభాగంలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రథమ స్థానం, అనంతపురం మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ద్వితీయ స్థానం, అండర్ -17 బాలుర విభాగంలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రథమ స్థానం, తిరుపతి ఎకార్డ్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్-14 బాలికల విభాగంలో కృష్ణా జిల్లా నరసింగపాలెం హీల్ స్కూల్ ప్రథమ స్థానం, హైదరాబాద్ సూర్యా అకాడమీ స్కూల్ ద్వితీయ స్థానం, అండర్ - 14 బాలుర విభాగంలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రథమ స్థానం, మెహబూబ్ నగర్ ఏకశిల ఇంటర్నేషనల్ స్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి.

విజేత జట్టుకు మెడల్స్, జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

మంచి క్రీడాకారులను తయారు చేయాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో క్రీడాలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కన్ఫరన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 2 అవుట్ డోర్ బ్యాడ్మింటన్ కోర్టు, వాలీబాల్ కోర్టులు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆమోదించారు. 50 సెంట్లు భూమిని సేకరించి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో మోడల్‌లో స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కేంద్రాల్లో 20 సెంట్లు చొప్పున భూమిని సేకరించి వాలీబాల్ కోర్టులు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జెడ్‌పి సిఇఒను ఆదేశించారు. మునగపాక, పాయకరావుపేట, దేవరపల్లి, రోలుగుంట మండలాల్లో భూమిని గుర్తించి క్రీడల వారీగా ఆట మైదానాల ప్రతిపాదనలు పంపించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి మాటాడుతూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పికెల్ బాల్ కోర్టు ఏర్పాటు చెయ్యాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడాలు అభివృద్ధి అధికారి ఎల్ వెంకట రమణ, జెడ్‌పి సిఇఒ, డిపిఒ సందీప్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి మంజుల వాణి, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, యలమంచిలి, అనకాపల్లి మునిసిపల్ కమిషనర్లు, ఎపిఐఐసి డిప్యూటీ మేనేజర్ రాజశేఖర్, సమగ్ర శిక్ష కార్యనిర్వాక ఇంజనీర్ నరసింహమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, జెసి జాహ్నవి, అధికారులు